# అర్ధసత్య

బి. జ్యోతి

ఇల్లు, కాలేజీ, స్నేహితులు, చదువు, పరీక్షలు - అన్నింటికీ మించి ప్రతిదానికీ అమ్మ, నాన్నల మీద ఆధారపడిపోయే ఆడపిల్ల జీవితంలో పెళ్ళి పెద్ద మార్పు. ఒక కొత్త వ్యక్తి ప్రవేశం జీవితంలో, అతన్ని మెప్పించాలి. మునుపు ప్రతిదానికీ అమ్మ, నాన్న ఉన్నారన్న ధైర్యం, వాళ్ళే అన్నీ చూసుకుంటారన్న ధీమా. ఇప్పుడు మనమీద ఆధారపడే ఒక వ్యక్తి. అతనికి తగ్గట్టు నడుచుకోవాలి. ఇల్లు సంబాళించుకోవాలి. సొంతంగా వండుకొని తినాలి. తెలుగుదేశం వదిలి కొంచెం దూరంలో కాపురం.

ఎమ్.ఎస్‌సి. ఫస్ట్ క్లాసులో పాసయ్యాను నేను - జువాలజీలో. ఇంకా ఏదో చేసెయ్యా లనుకుంటుంటే - "అమ్మో ! మంచి సంబంధం. వదులుకుంటే ఎలాగ?" అని హైరాన పడిపోయి అమ్మ, నాన్న నా పెళ్ళి కానిచ్చేశారు. ఆ సందడిలో పడిపోయాను నేను కూడా. నిజంగా మంచి సంబంధమే మరి. బాంకులో ప్రొబేషనరీ ఆఫీసరుగా సెలక్టయి, అప్పుడే నాలుగేళ్ళయింది. కొంచెం ఆస్తి ఉంది. మామగారు ఉద్యోగంలో ఉన్నారు. ఆడపడుచు ఒకామె అమెరికాలో ఉంది. ఇంకొకావిడ డాక్టరు. ఇద్దరి పెళ్ళిళ్ళూ అయిపోయాయి. అంతకన్నా ఏం కావాలి? అందరూ అదే అన్నారు.

స్నేహితులం అందరం కలిసి రీసెర్చి చెయ్యాలని, మంచి సైంటిస్ట్ లనిపించుకోవాలని, ఇంకా వీలయితే ఫారిన్ వెళ్ళిపోవాలని, చదివిన చదువు వృథా చెయ్యకూడదని యూనివర్సిటీ లైబ్రరీలో కూచుని లేటెస్ట్ మేటర్ అంత తెగ చదివేవాళ్ళం. అలాంటిది పరీక్ష లయేసరికి సగం మందిమి శుభలేఖలు పంచేసుకున్నాము. మిగిలిన వాళ్ళలో కొంతమంది సంబంధాలు కుదరకా, వాళ్ళపైన అన్నలకి ఇంకా పెళ్ళిళ్ళు అవకపోవడంతో - ఒంటరిగా ఉండిపోయారు. "ఇన్నాళ్ళూ సంబంధాలు కుదరలేదని చదివించాం గానీ, ఆ రీసెర్చి లేవో పెళ్ళయ్యాక మీరూ మీరూ చూసుకోండి" అంటూ కొంతమంది నోళ్ళు మూయించేశారు పెద్దవాళ్ళు. వీళ్ళింత విన్నారు, ఇక వచ్చేవాళ్ళు వింటారూ !

మా కెవరూ ఇటునుంచీ, అటునుంచీ కూడా తోడు రాలేదు మొదటిసారి కాపురం పెట్టడానికి.

"ఇంట్లో అన్నీ ఉన్నాయి, వెళ్ళి వండుకొని తినడమే. ఎవరూ రానక్కర్లేదు" అంటూ నా మొహం చూసి "ఇంత చదువుకున్నావు ఆమాత్రం ఒక్కదానివీ నెగ్గుకు రాలేవా?" అని నా చదువు గుర్తు చేశారు.

ఇల్లు బాగుంది. అన్ని సామాన్లూ సర్దేసి ఉన్నాయి.

చుట్టూ అన్ని ఇళ్ళు ఉన్నా ఎక్కడా సందడి కనిపించలేదు. ఆ మాటే అంటే - "బాగుంది. మీ కాలేజీ అమ్మాయిల్లా అందరూ పొద్దస్తమానం కేకలు పెడుతూ ఉంటారేమిటి? ఎవరి పనులు వాళ్ళవి" అన్నారు.

రోజంతా ఏవో ఏరుకుంటూనో, పూజలు చేసుకుంటూనో, లేకపోతే రొట్టెలు ఒత్తుకుంటూనో కనిపించారు జనం.

నా చేత్తో నేను మొదటిసారి కాఫీ పెట్టుకుని తాగాలంటే ఏడుపొచ్చింది నాకు. కాఫీ నయించనేలేదు. ఇన్నేళ్ళలో ఒక్కసారి కూడా నా చేత్తో నేను పెట్టుకోలేదు, అమ్మ చేసి ఇస్తే తాగడమే. ఆ మాటే అంటే ఆయన నవ్వు - "నాతోటి అంటే అన్నావు కానీ, ఇంకెవరితోటీ అనకు. ఇలాంటి పిల్లని చేసుకొచ్చానని నా మొహం మీదే నవ్వుతారు" అన్నారు.

వారం రోజులు వాళ్ళూ, వీళ్ళూ భోజనాలకి పిలవడంతో అట్టే గాస్ దగ్గరకి వెళ్ళే అవసరం లేకపోయింది. నెల రోజు లయేసరికి బోల్డు స్నేహాలు, మధ్యాహ్నం అయేసరికి ఎవరో ఒకరు రావడం, వాళ్ళతో బజార్లకి తిరగడం, లేకపోతే కబుర్లు చెప్పుకోడం. ఇవేవీ కాకపోతే లైబ్రరీ పుస్తకాలు చదవడం. క్లాసు పుస్తకాలు తప్ప ఇవేవీ ఎప్పుడూ చదవలేదు నేను. పరీక్షలు, చదువు ఈ టెన్షన్ లేకుండా రోజులు ఎంతో ఫ్రీగా ఎగురుతున్నట్టుగా గడిచిపోతున్నాయి. నా ఎమ్. ఎస్‌సి. డిగ్రీ సంగతే మరిచిపోయి, అంతలా సంసారంలో పడిపోయాను. తిరుగుడు ఎక్కువై, టైము తక్కువై పనిమనిషి కావలసి వచ్చింది. ఎవరిని అడిగినా మా పనిమనిషి సరిగ్గా చెయ్యదంటే, సరిగ్గా రాదంటే ఇలాగే ఏవో చెప్పారు. పదేళ్ళ నుంచీ అమ్మకి ఒక్కత్తే పనిమనిషి. దాన్ని వెతకడం ఇంత కష్టమని నాకు తెలియలేదు.

ఆయనతో అంటే "ఎమ్.ఎస్‌సి. పాసయ్యావు. ఆమాత్రం పనిమనిషిని సంపాదించలేవా?" అన్నారు - ఎమ్.ఎస్‌సి.లో అదేదో సబ్జెక్ట్ అన్నట్టుగా.

ఆ మర్నాడు మేడమీద పోర్షన్‌కి వెళ్ళాను. ఆయన ఎక్కువగా కాంపుల్లో ఉంటాడు. ఆవిడ ఒక్కరే పిల్లలతో ఉంటుంది. ఏవో నాలుగు కబుర్లు చెప్పి పనిమనిషి గురించి అడిగాను.

"మా ఇంట్లో చేస్తున్నదాన్ని పంపిస్తాను. దగ్గర్లోనే దాని ఇల్లు. మీకు ఎక్కువ పని కూడా ఉండదు. చేసుకుపోతుంది" అంది ఆవిడ.

సాధించాను కదా అని ఇంటికొచ్చి పడ్డాను.

మర్నాడు పది గంటలకి భోజనం కానిచ్చి గిన్నెలన్నీ ఒక చోట చేర్చాను. 'పనిమనిషిని పంపిస్తానంది కదా ఆవిడ - తోముదామా, అలాగే ఉంచేద్దామా' అని ఆలోచిస్తుంటే కాలింగ్ బెల్ మోగింది.

తలుపు తీస్తూనే ఎవరో అర్థం కాలేదు. పొరపాటున వచ్చిందేమో అనుకున్నాను. చింపిరి జుట్టూ అదీ నా కసలు నచ్చలేదు. అమ్మ దగ్గర పనిమనిషి ఎప్పుడూ మాకన్నా నీటుగా ఉండేది, అలాంటిది అది "పనిమనిషి కావాలన్నారట కదా బీబీజీ?" అంటూంటే నాకు ఏమిటోలా అనిపించింది. దాని వయసేమిటో దాన్ని పుట్టించిన భగవంతుడు కూడా చెప్పలేడు. దాని వెనకాతలే భూమికి రెండడుగులున్న ఒక పిల్ల కూడా ఉంది.

"రెండు పూటలా వస్తానమ్మా. శుభ్రంగా తోముతాను. మేడమీద బీబీజీని అడగండి" అని చెప్పుకుపోయింది.

"అంట్లకి ఎంత తీసుకుంటావు?"


"అదేంటమ్మా. అంట్లే నేమిటి? బట్టలూ శుభ్రంగా ఉతుకుతాను. టెర్లిన్ చీరలు, అయ్యగారి బట్టలు అన్నీను. మీరే చూడండి నాలుగు రోజులు."

దాని మాటల మధ్య జొరబడి నేను వద్దనలేకపోయాను. దానిమొహం చూస్తే ఎందుకో జాలేసింది. బట్టలు ఉతుక్కోడం నాకూ చికాగ్గానే ఉంది. సరిగ్గా టైముకి ఎవరన్నా వస్తే అలాగే ఉండిపోతాయి. మొత్తానికి నలభై రూపాయలకి మాట్లాడాను.

"గిన్నెలు, బట్టలు ఎక్కడున్నాయో చూపించండమ్మా" అంటూ జొరబడింది.

బట్టలు తీసి ఆ పిల్లని తడిపి పెట్టమంది. ఆ రెండడుగుల పిల్ల చకచకా చేసింది. ఈలోగా ఇది గిన్నెలు తోమి బోర్లించింది. బట్ట లుతికి ఆరేసింది నీటుగా.

నేను గుడ్లప్పగించి చూస్తున్నాను. ముందు దాన్ని గుమ్మంలో చూస్తే ఇది అసలు పని చెయ్యగలదా అనిపించింది. నరంలా ఉంది. మామూలు నగటు మనిషి వీల్చే గాలిలో దీనికి సగమయితే సరిపోతుంది - అనిపించేటట్టుగా ఉంది. మిగిలిన అన్నం ఉంటే దానికి ఇచ్చేశాను



మొదటి రోజే అయినా ఆలోచించకుండా. పని చేసిన చోట శుభ్రంగా కడిగేసింది. రోజూ నా అంతట నేను చేసుకునే దానికన్నా ఇవాళ అది పని చెయ్యడం చూస్తుంటే ఎక్కువ నీరసం వచ్చింది నాకు. కాకపోతే ఆ గిన్నెలు, బట్టలు ముట్టుకోనక్కరలేదంటే ప్రాణానికి హాయిగా అనిపించింది.

అమ్మయ్య. సాధించాను - అని సాయంత్రం ఆయనతో గర్వంగా చెప్పాను.

"మొత్తానికి ఎలాగయితేనేం - నీ ఎమ్.ఎస్‌సి. డిగ్రీ సార్థకం చేసుకున్నావు" అన్నారు వేళాకోళంగా.

ప్రతి మాటకీ నా చదువు, డిగ్రీ వెక్కిరించడం ఆయనకి సరదా. "ఎందుకొచ్చిన దండగ ఆ లేబరీటరీల్లో పడి? మీ టైము వేస్టు, గవర్నమెంటుకి డబ్బు దండగ. హాయిగా పనికొచ్చే దేదన్నా చదువుకోకూడదూ? అదీ కాకపోతే పనికిరాని చదువులూ ఉన్నాయి. అవి చాలు మీ ఆడవాళ్ళకి" అంటుంటారు.

ఒక్కొక్కసారి ఆలోచిస్తుంటే నాకూ నిజమే అనిపించేది. ఎంత కష్టపడి చదివాము, జ్ఞానం సంపాదించామే గానీ నిత్యజీవితంలో ఎంతవరకూ ఉపయోగిస్తున్నాము?

సెలవు రోజున పనిమనిషిని చూసిన ఆయన నామీద ఇంత ఎత్తున లేచారు - "అదెలా ఉందో చూశావా? దాని ఒంట్లో ఎక్కడన్నా కండ ఉందా? ఎముకలు తప్ప. నీకెలా మనసు ఒప్పింది దానితో పని చేయించుకోడానికి. ఇంకెవరూ దొరకలేదా?" అంటూ.

"నేను అలాగే అనుకున్నాను మొదటిసారి చూసినప్పుడు. కానీ దాన్ని చూడండి ఎంత చురుగ్గా చేసుకుపోతుందో? పిల్లలు కూడా చేస్తారు సాయం" అని సర్దేశాను.

నిజానికి దాన్ని చూస్తుంటే నాకూ బాధగానే ఉంది. కానీ పాపం దానికి డబ్బు అవసరం అయి ఉంటుంది. అందుకే అలా కష్టపడుతోంది. 'ఎప్పుడు చెయ్యలేకపోతే అప్పుడు అదే మానేస్తుంది. నే నెందుకు మాన్పించాలి?' అనుకుని - "ఎన్ని ఇళ్ళలో చేస్తావు నువ్వు?" అని అడిగాను. నా పని మాత్రం బాగానే చేస్తోంది, రెండు పూటలా.

"పది ఇళ్ళలో చేస్తాను" అంది ఎంతో మామూలుగా.

పొద్దుటినుంచీ పది ఇళ్ళూ తిరుగుతుందా? అదీ రెండుసార్లు. ఇది మామూలు మనిషి కాదు. బాటరీతో గానీ పని చేస్తోందా అనిపించింది. లేకపోతే దీని ఎముకలు ఇనుముతో నన్నా చేసి ఉండాలి.

"బాగానే సంపాదిస్తావు అయితే. ఈ ఇద్దరేనా - ఇంకా ఉన్నారా పిల్లలు?"

"ఆరుగురు పిల్ల లమ్మా. నా మొగుడు ఇష్టం ఉన్న రోజు సంపాదిస్తాడు. లేని రోజు లేదు. ఇంతమంది తినాలి గదమ్మా. ఎంత సంపాదిస్తే సరిపోతుంది?"

ఒక్కసారి వెనక్కి తిరిగి దాన్ని సరిగ్గా కళ్ళతో చూస్తేనే గానీ నేను ఉండలేకపోయాను. ఆ ఎముకల పోగుకి ఆరుగురు పిల్లలా? ఆరుగురు దీని ఒంట్లోంచి నెత్తురు, కండ పంచుకున్నారా? ఏ సిద్ధాంతానికన్నా అందే విషయమేనా?

పది ఇళ్ళు చేసుకుంటే వాళ్ళిచ్చే వాటితో సగం

## బిల్లు

"నా కుమారుడు ప్రతి చిన్న విషయానికీ నా సలహా అడిగి మరీ పనిచేస్తాడు. పైగా ఎంతో పొదుపరి కూడాను."

"అలాగా? పొదుపరి అని ఎలా చెప్పగలుగుతారు?"

"మహబూబ్‌నగర్ నుండి తాను చెప్పులు కొనుక్కునే సమయంలో 'నాన్నా నేను చెప్పులు కొంటున్నాను. ధర పాతిక రూపాయలకు నేను అడిగితే - యజమాని 48 అంటున్నాడు. తీసుకుందునా అని అడిగాడు ఫోనులో" అన్నాడు తండ్రి సంతోషంగా.

"అలాగా. ఫోన్ బిల్ ఎంతైంది?"

చాగాపురం

నోళ్ళు నిండిపోతాయి. అప్పుడు అర్థం అయింది నాకు. దానికి అంత ఓపిక ఎక్కడనుంచి వస్తోందో? ఆ పిల్లల కడుపులు నింపడం కోసం. దానిమీద జాలి రోజు రోజుకీ ఎక్కువైపోయింది నాకు.

రోజులు తొందరగా గడిచిపోతున్నాయి. నా చదువు, డిగ్రీ సంగతి ఎంతలా మరిచిపోయానంటే ఆయన ఒక రోజు "ఎవరయినా పిల్లలు కాలేజీలో చదువుకున్న వాళ్ళూ ఉంటారు. నీ సబ్జెక్టులో తెలియనివి చెప్పించుకుంటారేమో. కనుక్కోకూడదా? కాస్త కాలక్షేపంగా ఉంటుంది. గుర్తు తెచ్చుకున్నట్టుగానూ ఉంటుంది" అంటే "ఊ" అని ఊరుకున్నానే గానీ మళ్ళీ అవన్నీ పుస్తకాలు తిరగెయ్యాలంటే భయం పట్టుకుంది. అంతగా మారిపోయాను.

ఈ మధ్య యశోదని - అదే మా పనిమనిషిని చూస్తుంటే ఏమిటో తేడాగా ఉంది. పొట్ట పెరుగుతోందేమో అనిపించింది. అన్ని కాన్పు లయ్యాయి. ఏ అల్సరో, కాన్సరో కాదుగదా - అని భయం వేసింది. దానికేం తెలుసు? మరీ ముదిరాక చేసేదేం ఉంటుంది? ఎవరు చెప్తారు పాపం? ఎవరికి పట్టింది? దీనికేమన్నా అయితే ఆ పిల్ల లందరూ ఏమవుతారు? అనుకుని మరీ దాన్ని బెదరగొట్టకుండా నెమ్మదిగా - "నీ ఒంట్లో బాగుంటుందా? ఏదో నలతగా ఉన్నట్టున్నావు? ఒంట్లో ఏమీ లేదు కదా?" అన్నాను ఆరా తీద్దామని.

"నాకేం అయిం దమ్మగారు? మొదటిసారా ఏమన్నానా? ఆరుగురయ్యారు" అంటూ నవ్వింది పైగా.

నాకు ముందర అది ఏమంటుందో అర్థం కాలేదు. ఎంత హిందీ వచ్చినా సరిగ్గా అర్థం చేసుకున్నానా, లేదా అనిపించింది. "అంటే?"

"ఇంకా చిన్నపిల్లలు. మీకేం అర్థం అవదులెండి. మొదటి రెండుసార్లు కాబోలు కాస్త మురిపెంగా చూసుకున్నాడు మావాడు. ఇంక అంతే. ఆ తరువాత నుంచి ప్రతిసారీ పుట్టిన పిల్ల కన్నా నా ఏడుపే ఎక్కువ, వాడి గోలెక్కువ, ఆడపిల్ల పుట్టిందని. ఇంక ఇప్పుడు నాకు అలవాటైపోయిం దమ్మా."

ఇంకోటీ, ఇంకోటీ అలవాటయిందంటే బాగుంది గానీ, పిల్లల్ని కనడం అలవాటవుతుందా ఎవరికన్నా? అలవాటేమిటి నా మొహం?


"ఇన్ని కబుర్లు చెప్పుకున్నావు. అలా గోలపెట్టే బదులు ఆపరేషను చేయించుకోగూడదూ? ఇంతమందికి తిండి పెట్టాలా?"

"అదేం టమ్మా. మగపిల్లా డేడీ? అందరూ ఆడపిల్లలే గదా. నా మొగుడు ప్రతిసారీ గోల పెడతాడు. తొమ్మిది నెలలూ నా ప్రాణం తింటాడు. వాడి గోలకి తగ్గట్టే ఆడపిల్లలు పుట్టుకొస్తున్నారు. చూద్దాం. ఎప్పటికి వాడి కోరిక తీరుతుందో?"

మగపిల్లవాడు కావాలంటూ ఆరుగురు ఆడపిల్లలని కన్నదా? అలా ఎన్నాళ్ళు? దాని మూర్ఖత్వానికి నాకు ఒళ్ళు మండింది. మొట్టమొదటిసారి దానిమీద జాలి పోయింది.

నా మొహంలో ఏం చూసిందో అది, గొంతు తగ్గించి - "ఈ వీధి చివర పెద్ద మేడ మార్వాడీ బాబులు ఉన్నారే? వాళ్ళ కోడలికి మొదటి రెండుసార్లు ఆడపిల్ల పుడితే మిఠాయి ఉండన్నా ఇవ్వలేదమ్మా. అలాంటిది మూడోసారి మగపిల్లవాడు పుట్టేసరికి రెండు రోజులు మా భోజనాలన్నీ అక్కడే. అంత గొప్పగా చేశారు. అందరికీ మగపిల్లవాడు కావాలని ఆశ ఉంటుం దమ్మా. అయినా మగపిల్లవాడిని కనకపోతే అదేం జన్మ తల్లీ?" అంది.

బాగుంది దాని లాజిక్. కానీ ఇలా ఎన్నాళ్ళు





కంటుందిట? దాని ఎముకలు పిండయిపోయి, రక్తం ఎండిపోయేదాకానా?

ఆ రాత్రి ఆయనతో అన్నాను - "మన పనిమనిషికి కడుపు" అని.

"హాతోస్మి. ఏదో మంచి పనిమనిషి దొరికిందని మురిసిపోతున్నావు. ఇంకోదాన్ని వెతుక్కోవాలా?"

"అంత ఆపద రాదులెండి. దానికి రెండు పూటలా తిండి తినడం ఎంత మామూలో, ఏడాదికి ఒకసారి కనడం అంతే మామూలు. ఆరుగురు పిల్లలట దానికి."

"చూశావా? భగవంతుడు దాంట్లో అంత కష్టం పెట్టినా చిటుకూ చిటుకూ కనిపారేస్తున్నారు. అలా కాక ఏమాత్రం సులభం చేసినా ఈ భూప్రపంచం ఎలా ఉండేదో? అయినా ఇంక్రిమెంట్లు ఆపేస్తాం అంటూ మిగతా జనాన్ని భయపెడతారు గానీ ఇలాంటి వాళ్ళని ఏమీ చెయ్యరు. కొన్నాళ్ళకి వీళ్ళు ఒక బర్డెన్ అయిపోతారు దేశానికి."

"వాళ్ళకేం బెంగ? నడక వస్తే చాల్లు దాని వెనకాతల పనికి తయారైపోతున్నారు. [illegible] తిండి వాళ్ళే సంపాదించుకుంటున్నారు. ఇన్నాళ్ళకి, ఒక్క మగపిల్లవాడు పుడితే ఏం ఉద్ధరించేస్తాడని? వీళ్ళేం పెట్టి పెంచేస్తారని, దాని మొగుడు సంపాదించడని గోల పెడుతుంది. ఇక మగపిల్లవాణ్ణి కని వాడి చేత కూడా తిట్లు, చీవాట్లు తినాలని సరదా కాబోలు." అక్కసుగా అన్నాను.

"నీ కెందుకోయి మధ్య ? మగపిల్లవాడు లేకపోతే మరి వాళ్ళ సామ్రాజ్యానికి వారసుడు లేకుండా పోడూ? అరాచకమయిపోదూ?" అంటూ నవ్వారు.

నాకు నవ్వు రాలేదు. నిజమే. పూర్వం రాజులు మగపిల్లవాడు లేడని బెంగపెట్టుకునేవారు - అలా ఉంది దీని బెంగ.

నెలలు గడుస్తున్నాయి. యశోద మాత్రం దానికీ, పెరుగుతున్న కడుపుకీ ఏం సంబంధం లేనట్టు అలాగే చుర్రుగ్గా పనులు చేసుకుపోతోంది.

"కాస్త పనులు తగ్గించుకోకూడదూ?" అన్నాను. దాని కడుపు నాకు అలవాటయిపోయింది. పైగా ఏం పిల్ల పుడుతుందా - అని నాకూ ఉత్సాహం పెరిగింది.

"అదేంటమ్మా? నా కలవాటే. కనే రోజు దాకా పనులు చేస్తూనే ఉంటాను. మళ్ళీ నెల తిరగకుండానే పనిలో చేరిపోతాను. కూర్చుంటే ఎక్కడ అవుతుంది?" అంది.

అంతే గానీ దీని మగపిల్లవాడి పిచ్చి వదలదన్న మాట. కడుపు, పురుడు అంత తేలిగ్గా తీసుకోడం నాకు ఆశ్చర్యంగా ఉంది. అది అన్నట్టుగా దానికి అలవాటు అయిపోయింది నిజంగానే. కానయితే ఒక రోజు అది ఎందుకో బాగా డీలా పడిపోయినట్టు కనిపించింది. రోజు ఉండే చురుకుదనం లేదు.

"ఏమే అలా ఉన్నావు? కాస్త పని తగ్గించుకోమన్నానా? ఒకసారికి ఒకసారి నీరసం రాదూ మరి. ఒకటా రెండా?" దాని ముందు నాకు పెద్దరికం ఎక్కువైపోయింది.

"అది కాదమ్మా. మావాడే రోజు గొడవ పెట్టి చంపేస్తున్నాడు. నేనేం చెయ్యను? ఏటి కేడాదీ కంటూనే ఉన్నాను. ప్రతిసారీ ఆడపిల్లే. ఈసారి మగపిల్లాడు పుట్టకపోతే నువ్వు, నీ ఆడసంత ఎక్కడికన్నా పొండి, నేను నేరేదాన్ని చేసుకుంటాను అని మొదలెట్టాడు. నాకేం పాలుపోవడం లేదమ్మా. ఇల్లూ, వాకిలీ లేకుండా ఇంతమందిని ఎలా సాకనమ్మా? ఎక్కడికి పోతాను?" అని కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

ఇన్నాళ్ళూ దాన్ని ధైర్యంగా చూడ్డమే గానీ ఇలా చూసేసరికి నాకు కళ్ళనీ ళ్ళొచ్చాయి. ఏం బతుకు దానిది? ఎంత మా టన్నాడు? మగపిల్లవాడిని కనకపోతే తరిమేస్తారా? వాడు మనిషేనా? అది ఒక్కర్తే కూచుని కంటోందా? వాడి తప్పేం లేదా?

గొడ్డుకన్నా అన్యాయం దాని బతుకు. ఏటి కేడాది గొడ్డు కూడా కంటుంది. ఆడో, మగో దానికేం తెలియదు. వాటి గురించి కొన్నాళ్ళయ్యాక పట్టించుకోనూ అక్కర్లేదు. దీని కలా కాదే? జీవితాంతం ఆ పిల్లల గోల తప్పదు. ఆడదాని బతుకు గొడ్డుకన్నా హీనమా? నాకు కడుపులో దేవినట్లయింది.

దొంగవెధవ ! ఇదే వాడిని వదిలేస్తా ననాల్సింది. ఏం ఉపయోగం ఉంది వాడివల్ల - ఏటి కేడాది కనడం తప్ప? ఆరుగురు పిల్లల్ని కన్నాక పెళ్ళాన్ని వదిలేస్తాడా? మగవాడి ననేసరికి ఎంత పొగరు? ఈడ్చి నాలుగు తన్నేవాడు లేక - మనసులోనే వాణ్ణి తెగ తిట్టుకున్నాను.

ఆ రోజు మళ్ళీ ఆయనతో దాన్ని గురించే చర్చ.

"మంచి పనిమనిషి దొరికింది. అది తప్ప ఇంకో టాపిక్కే లేదా నీకు?" అన్నారు.

"మరేమిటి లేకపోతే - మగపిల్లవాడు లేడని వదిలేస్తాడా?"

"దాంట్లో అంత వింతేముంది? వాడయితే చదువు సంధ్య లేనివాడు, జ్ఞానం లేనివాడు. మనలో ఎంతమంది లేరు మగపిల్లాడు లేకపోతే అది పెళ్ళాం చేతకానితనమే అనేవాళ్ళు. అంతదాకా ఎందుకు? పిల్లలు పుట్టలేదంటే ఎంతమంది చదువుకున్న మగవాళ్ళు నాలోనే తప్పుందేమో అని ముందుగా పరీక్ష చేయించుకుంటారు చెప్పు? ఆడవాళ్ళకి తొంభై పరీక్షలయ్యాక అప్పటికీ తప్పదని చేయించుకునే వాళ్ళు కొంతమందే. అసలు పిల్లలు లేకపోవడానికీ, తమకీ ఏం సంబంధం లేదనుకునేవాళ్ళు ఇంకా ఉన్నారు మనలో కూడా, మగవాళ్ళు. మా మామయ్య బావమరిది ఇలాగే వాళ్ళావిడికి ముగ్గురు ఆడపిల్లలు పుట్టాక ఎవరో ఒక ఉద్యోగం చేసుకుంటున్న అమ్మాయిని తగిలించుకున్నాడు. ఆ పిల్లకి మగపిల్లవాడు పుట్టుకొచ్చాడు. ఇంకేముంది? ఇన్నాళ్ళూ దొంగతనంగా ఉన్న వ్యవహారం బయటకి వచ్చింది. నేనే గదా మగపిల్లవాడిని కన్నానని ఆ పిల్ల విజృంభించింది. ఉండు ఇంకా అవలేదు కథ. ఇంతలోకి అసలు పెళ్ళాం కూడా మగపిల్లవాడిని కనేసింది. ఇంకేముంది? లీగల్‌గా ఈ పిల్లాడే కదా వారసుడు. ఇక ఆ పెళ్ళాం అతన్ని కట్టిపడేసింది. ఇన్నాళ్ళూ ఈవిడని ఈసడించిన అత్త వా రందరూ మళ్ళీ ఇటు తిరిగిపోయారు. పరుగెత్తుకు వెళ్ళి అతను ఆపరేషను చేయించుకుని ఆ జోరు ఆపాడు. కానీ జరగవలసింది జరిగిపోయింది. అదీ కథ. మగపిల్ల వాడికోసం అంటూ ఎన్ని అవస్థలు పడిపోతున్నారో చూడు జనం" అంటూ నవ్వారు కానీ, నాకు ఈసారి నవ్వు రాలేదు.

ఎంత సీరియస్ మేటర్? పైగా చదువుకున్న వాళ్ళూ ఇంతే అంటారు. అదీ ఒక గొప్పే!

నా కోపం చూసి ఆయన - "మగవాడికి సహజంగా తనేదో 'సుపీరియర్' అన్న ఫీలింగ్ ఉంటుంది కాస్తో కూస్తో. దాంతో తనకి మళ్ళీ ఒక మగపిల్లవాడు ఉంటే అక్కడికి ఆ సుపీరియారిటీ పూర్తయినట్టన్న మాట. ఆ ఫీలింగే దీనికంతటికీ కారణం. పుట్టకపోతే ఏం చెయ్యలేక కబుర్లు చెవుతారు గానీ మీ ఆడవాళ్ళకీ మనసులో ఉంటుంది మగపిల్లవాడు కావాలని. మన సొసైటీలో పరిస్థితులు అలా ఉన్నాయి మరి. ఆడదాని కన్నా మగవాడి బతుకు హాయి అని కదా అందరూ అనుకోవడం" అంటూ సర్దారు.

ఏదో పెద్ద రీజనింగ్ ఇచ్చినట్టు చెప్పారు గానీ నిజం ఒకటే. మగ, ఆడ రెండే జాతులు. మగవాడు మరి సుపీరియర్ అనుకుంటే ఆడది 'నీచజాతిది అన్న మాటే కదా. నీచజాతి వాళ్ళనే కన్న ఆడది కూడా నీచజాతిదే. అలా కాక సుపీరియర్ జాతిని కంటే దానికి కూడా కాస్తో కూస్తో సుపీరియారిటీ అంటుకుంటుదన్న మాట.

కోపంతో, ఉక్రోషంతో కళ్ళు, ముక్కు ఎర్రగా చేసుకోవడం తప్ప ఏమీ చెయ్యలేకపోయాను.


ఆ రోజు సాయంత్రం పని కానిచ్చి యశోద చతికిలపడింది నే నిచ్చిన టీ తాగుతూ.

దాన్ని చూస్తే భయంగా ఉంది నాకు. పొట్టంతా కిందకి జారిపోయి ఇవాళో రేపో కనేట్టుంది. అమ్మ అంటుండేది అక్కయ్య పురుటికి వచ్చినప్పుడు - పొట్ట అలా కిందకి జారిపోతే ఇక పురుడు వచ్చేస్తుందని. దానికీ, నాకూ ఏం సంబంధమో గానీ నే నింతలా తాపత్రయపడిపోతున్నాను దాని గురించి.

"నిన్ను చూస్తుంటే భయంగా ఉంది యశోదా? ఎలా చేస్తున్నావు బాబూ?" అన్నాను.

"పని గురించి కాదమ్మా. రోజు మా వాడి గొడవ ఎక్కువయిపోయింది. ఇంతమంది ఆడపిల్లలని వేసుకుని ఎక్కడికి పోను? అయినా నా కర్మ కాకపోతే ఇంతమందిని కన్నా ఒక్కడన్నా మగపిల్లాడు కాలేదంటే ఏం జన్మమ్మా నాది? వెధవ జన్మ. గొడ్డుమోతు దానికన్నా అన్యాయం. ఇన్ని కాన్పుల్లో ఒక్క మగపిల్లాడు లేడంటే నాకే సిగ్గుగా ఉంది."

దాని మాటలకి నేను అవాక్కయిపోయాను. 'మగపిల్లవాడు పుట్టనంత మాత్రాన దా న్నదే శాపనార్థాలు పెట్టుకుంటుందా? తొమ్మిది నెలలు మోసి కన్న ఆడపిల్ల లందరూ కూడా ఏదో చెత్త చెదారం అన్నట్టు మాట్లాడుతుందా? ఆడవాళ్ళం అంత దిగజారిపోయామా? ప్రతిదానికీ తమమీదే తప్పు వేసుకోవడం వాళ్ళకి అలవాటయిపోయింది. కానీ ఇటువంటి విషయంలో కూడానా? కనడం అయితే వాళ్ళు కంటున్నారు గానీ, ఆడో, మగో ఎవరికి తెలుసు? పోనీ దాని కేమయినా ప్రత్యేకమైన అర్హతలు, తెలివితేటలు కావాలంటే తిట్టొచ్చు, నువ్వు తెలివితక్కువ దానివవి. మన చేతుల్లో లేని దాని గురించి ఎందుకలా అందరూ ఆడవాళ్ళ నంటారు? - దాని మాటలకి నాకు తల కొట్టేసినట్టయింది. ఇటువంటి పరిస్థితుల్లో దాన్ని అదే అలా తిట్టుకుంటూ దానిలోనే ఏదో లోపం ఉందనుకుంటూ ఉంటే రేపొద్దున నిజంగా మళ్ళీ ఆడపిల్ల పుడితే అది పిచ్చెత్తిపోతుందేమో. ఏదయినా చెప్పి దాన్ని ఊరడించా లనిపించింది. కాస్త గట్టిగా, నమ్మకం కలిగించేలా చెప్పాలి 'పిచ్చిమొద్దు దీనికి నువ్వు, నేనూ ఏమీ



చెయ్యలేమే' అని.

నడన్‌గా నేను చదివిన 'జెనెటిక్స్' గుర్తొచ్చాయి. మనిషిలో 'సెక్స్' నిర్ధారించే క్రోమోజోమ్స్ ఎక్స్ వై ఉంటాయని, ఆడవారిలో రెండు 'ఎక్స్'లే, మగవాళ్ళలో ఎక్స్ వై రెండూ ఉంటాయని, రెండు 'ఎక్స్'లు కలిస్తే ఆడపిల్ల, ఒక ఎక్స్, ఒక వై కలిస్తే మగపిల్లవాడు పుడతారని స్కూలు స్టేజీలోనే చదువుకున్నాము. ఆడ, మగ అన్నది మన చేతుల్లో లేదని, ఎప్పుడా అద్భుతం జరిగేది సృష్టి రహస్యం అంతే - అని దానికి పై విషయాన్నే సాధ్యమైనంతగా తెనిగించి చెప్పాను. దానికి ఏమర్థమయిందో తెలియదు గానీ మొత్తానికి విన్నాక మొహం మాత్రం వెలిగింది.

"నిజంగా నమ్మా? మీరు చదువుకున్న వాళ్ళు. ఇలాంటి వన్నీ తెలుస్తాయి. నీ నింకా అదేదో మనమే కంటాం కాబట్టి మనలోనే తప్పుంది అనుకుంటున్నాను. ఎంత మంచి మాట చెప్పావు తల్లీ. నాలో ఏం తప్పు లేదన్నమాట" అని మురిసిపోయింది.

దానితో పాటు నేనూ మురిసిపోయాను. అవును మరి, అస్తమానం నాది దరిద్రపు జన్మ, వెధవ జన్మ అని తిట్టుకుంటుంటే అసహ్యంగా ఉంది.

"చూడు. నా పని మానెయ్యి ఇక. మళ్ళీ నిన్నే పెట్టుకుంటాను. అంతేగానీ ఇక ఊరికినే అలిసిపోకు. ప్రాణం మీదికి తెచ్చుకుంటావు. మిగతా పనులు కూడా కాస్త తగ్గించుకో. డబ్బు కొంచెం ఇస్తాను కావలిస్తే. తరువాత తీర్చుకుందువు గానీ. నీ చేత పని చేయించుకోడం నాకే సిగ్గుగా ఉంది." కొంచెం అన్నం, కూర ఇచ్చి "నువ్వు కడుపునిండా తిను ఈ రెండు రోజులూ కనేదాకా" అన్నాను.

దాని కళ్ళనిండా నీళ్ళు.

"చిన్నదానివయినా ఎంత గొప్ప మనసమ్మా నీది. బిడ్డల్ని కన్న వాళ్ళకే తెలుస్తాయి బిడ్డ నొప్పులు అంటారు. అలాంటిది నీ కెంత జాలమ్మా? ఏ తల్లి కన్న బిడ్డవో కానీ నా ఆయుస్సు కూడా పోసుకుని పిల్లా పాపల్తో బతుకమ్మా" అంది ఎంతో ఆర్ద్రంగా.

అదెప్పుడూ అలా కళ్ళనీళ్ళు పెట్టుకోలేదు పాపం. నాకూ కళ్ళమ్మట నీళ్ళొచ్చాయి. ఏం జన్మ దానిది? రెండు మంచి మాటలకి కూడా నోచుకోలేదు జీవితంలో. ఆడ బ్రతుకంటే మొట్టమొదటిసారిగా అసహ్యం వేసింది నాకు.

"ఛ. అలాంటి పిచ్చి మాటలు మాట్లాడకు" అని కసిరాను.

మర్నాడు ఆదివారం. లేచేసరికి బారెడు పొద్దెక్కిపోయింది. ఈసరికి రోజూ యశోద వచ్చి పని చేసుకుని పోతుంది. 'నిన్న వద్దన్నాను గదాని మానేసిందేమో. పిల్లనన్నా పంపిస్తుందే. అలా చెప్పకుండా మానెయ్యదు పాపం.' అనుకుని లేస్తుంటే - "సెలవు రోజు. పడుకుందూ కాసేపు. రోజూ వచ్చే మీ అలారం వాచీ రానట్టుంది. ఏ రాత్రో కనేసి ఉంటుంది" అంటూ అటు తిరిగి పడుకున్నారు ఆయన.

'నిజమే' అనిపించింది నాకు. నిన్న దాని పరిస్థితి చూస్తే అలాగే అనిపించింది. పడుకున్నానే గానీ నిద్ర పట్టలేదు. తోచలేదు. దాని ఇంటి దగ్గరే ఉండే పనివాళ్ళు ఎవరో ఒకరు కనిపిస్తారు, అడుగుదామని వీధిలోకి వెళ్ళాను. మేడమీద ఆవిడ గేటు దగ్గర నిలబడి ఇంకో మనిషితో మాట్లాడుతోంది. యశోద సంగతి తెలుస్తుందని నేనూ అక్కడికే వెళుతుంటే ఆవిడ వెనక్కి తిరిగి నన్ను చూసి, "విన్నారా యశోద పోయిందట పాపం !" అంది.

నిద్రమత్తులో ఉన్న నాకు ఒక్కసారి షాక్ ఇచ్చినట్లయి, చెవులు హోరెత్తిపోయాయి. కళ్ళు చీకట్లు కమ్మేశాయి.

"ఎప్పుడూ పల్లెత్తు మాట అనేది కాదమ్మా. ఆ వెధవకి అలవాటే అస్తమానం మగపిల్లవాణ్ణి కంటావా, లేదా అని సతాయించడం. ఈసారి మరీ తరిమేస్తానంటూ బెదిరింపు. అయినా రోజూ కళ్ళనీళ్ళు పెట్టుకోడం తప్ప తిట్లు, తన్నులూ అలాగే భరించేది. అది మాత్రం ఏం చేస్తాదమ్మా. అందరికన్నా ఎక్కువగా ఏటి కేడాది కంటూనే ఉంది. మన చేతిలో లేనిదానికి ఏం చేస్తాం? నిన్న రాత్రీ అదే గోల. మా కలవాటయిపోయింది. కాసేపు అరిచి ఊరుకుంటా డనుకున్నాం. నా ప్రాణం తింటావేమిటి, ఏటి కేడాదీ కంటూనే ఉన్నాను, నీలో మగతనం ఏడిస్తే కదా మగపిల్లాడు పుట్టడానికి, ఆడంగివెధవా, అందుకనే నా కీ ఆడసంత, అంటూ ఇదీ మొదలుపెట్టిం దమ్మా. దాన్ని అనడానికి లేదమ్మా - వెధవ ప్రాణం విసిగిపోయింది. ఏడుగురు పిల్లలంటే మాటలా? ఏదో అని వాడి నోరు మూయించా లనుకుంది. అంతే. ఒక్కతాపు తన్నాడు. ఒక్క చావుకేక పెట్టింది. గిల గిల కొట్టుకుంది. అలాగే మోసుకుపోయాం ఆస్పత్రికి. తెల్లారుజామున ప్రాణం పోయిందమ్మా. కన్ను విప్పి చూసుకోలేదు, చెవితోటి వినలేదు - మగపిల్లాడు పుట్టాడమ్మా. అదేం శని దూరిందో దాని నోట్లో నిన్న అంత నోరు పెట్టుకుంది. రోజులాగే ఊరుకుని ఉంటే, ఈసరికి ఎంత చక్కగా ఉండే దమ్మా. దాని రాత ఎప్పుడూ బాగాలేదు తల్లీ !"

నేలంతా కదిలిపోయి, చుట్టూ గిరగిరా తిరిగిపోతున్నట్టుంది. 'భగవంతుడా? నిన్న నేను చెప్పినది విని అది అలాగ అర్థం చేసుకుందా? తీరిగ్గా కూచుని నిన్ననే నేను ఆ మాటలు చెప్పాలా? అయ్యో యశోదా, ఎంత పని చేశావు? ఏదో నిన్ను తృప్తి పరచాలని అలాంటి మాట చెప్పాను. ఛీ ఇలా చేస్తావనుకోలేదే?" అని వస్తున్న వెక్కిళ్ళు ఆపుకుంటూ లోపలికి వెళ్ళాను.

"యశోద చచ్చిపోయిందండీ" అంటూ భోరుమన్నాను.

"నే ననుకుంటూనే ఉన్నాను. దాన్ని చూస్తే ఎలా ఉంది? మూర్ఖత్వంతో చావు కొని తెచ్చుకుంది" అని అంటుంటే మధ్యలోనే ఆపి - విషయమంతా దాచకుండా చెప్పాను. ఎవరికన్నా చెప్పేనే కాని - నా గుండె బరువెక్కిపోయి ఉంది, భరించలేకుండా ఉన్నాను.

"ఎంత పని చేశావు లతా? దానికి సైన్సు చెపుతావా? ఏం అర్థం అవుతుందని? దాని ధోరణిలో పాపం అది ఏదో అర్థం చేసుకుంది. ఇన్నాళ్ళూ వారి మాటలకి విసిగిపోయి పాపం నువ్వు చెప్పిందేదో దాని ఇష్టమొచ్చినట్టు వాగింది. చదువుకున్న వాళ్ళే ఇలాంటి విషయాల్లో ఎలా ప్రవర్తిస్తారో నీకు తెలుసు కదా? అలాంటిది వాడు ఈ మాటలకి రెచ్చిపోయాడంటే పోడూ మరి ! నీ ఆ 'క్రోమోజోన్సు' విషయంలో రీసెర్చి చేసినవాడు కూడా మన దేశంలో భార్య అలాంటి మాటలంటే అంతే మూర్ఖత్వంతో ప్రవర్తిస్తాడు. నువ్వు చెప్పింది నిజం కావచ్చు, కానీ దానికి అర్థం అయింది సగమే. ఇలాంటి అర్ధసత్యాల వల్ల కొంపలు మునిగిపోతాయి. ఏ విషయమన్నా పూర్తిగా అర్థమయితేనే ఉపయోగం - లేకపోతే చూడు ఎలాంటి పని చేశావో?"

ఆయన మాటలకి నా కింకా ఏడు పొచ్చింది. నిన్న సాయంత్రం యశోద మొహం నా కళ్ళముందే ఆడుతోంది.

'నా ఆయుస్సు పోసుకొని బతుకు తల్లీ ! అన్నాక పన్నెండు గంటలు కూడా బతకలేదు అది. అంతే...'

ఆ తరువాత ఆలోచించలేక వణికిపోయాను ☆

## పిలుపు

"ఒసేవ్ కాంతం, నీ కోసం ఎవరో వచ్చారే" భర్త అన్నాడు.

బయటకు వచ్చి చుట్టూ చూసి "ఎవరు లేరుగా?" అంది భార్య.

"మరి నా కళ్ళజోడు ఇమ్మని పదిసార్లడిగినా వినిపించుకున్నావా నువ్వు?" చురక అంటించాడు భర్త.

- పద్మశ్రీ [మాణిక్యారం]

